# ఊహించిన వరుడు

"ఎందుకే నవ్వుతున్నావు?"

"నవ్వానా! ఏం లేదు..."

"ఏం లేదూ! ఎందుకే యింతలో అబద్ధం" అని పిన్ని మూతి ముడిచింది

తనని చూసి నవ్వానని పిన్ని అనుకుంది.. కాని ఎందుకు నవ్వాను? ఎప్పుడో జరిగిన ఏదో సన్నివేశం గుర్తుకువచ్చి.. అప్పుడు మరోక విధముగా ప్రవర్తించివుంటే ఎల్లా వుండేదో వూహించుకుంటే నవ్వువచ్చింది. ఫలానందుకు నవ్వానంటే పిన్ని నమ్ముతుందా?

"ఏమిటే ఎప్పుడూ ఆలోచిస్తావు?" అంటుంది అమ్మ.

ఒకదాని గురించి ఏమిటి? నేనసలు ఆలోచించని, వూహించని విషయమంటూ లేదు. "ఏ గడ్డం క్రిందికి చేతులు వెళ్ళాయి అంటే.. యీ లోకం విడిచి పెట్టి.. వూహాలోకాలకి వెళ్లినట్లు గుర్తు అన్నమాట" అంటుంది విజయ.

అల్లా కూర్చుని.. ఎంతసేపయినా, ఏదో ఆలోచించుకుంటూ కాలము గడిపివేయగలను.

ఒకసారి కాలేజిలో యింగ్లీషు లెక్చరరుగారు పాఠము చెప్పుతున్నారు ఆయన చాల నవనాగరికుడు కొంచెము స్థూలకాయుడు. నేను పాఠము వింటము లేదు... ఆయనకో ఆకారము వూహించాను... ఆయన నున్నగా గుండు చేసికొని పట్టెడు నంగనామాలు ముఖాన్న తీర్చికొని, మెళ్లో చామంతి పూలదండ వేసుకొని, పట్టుపంచె కట్టుకుని, కాళ్ళకి గజ్జెలు కట్టుకొని చేత్తో చిడతలు వాయిస్తూ, ధనుర్మాసం పందిరలో రాగయుక్తంగా పద్యము పాడుతుంటే ఎల్లా వుంటుందో వూహిస్తున్నా.. ఆయన కోపిష్టి. "ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగాడు, నన్ను చూసి!.."

ఎందుకని చెప్పను! "వూరికే" అన్నా...

"అల్లా అయితే, నీవు వుండవల్సింది పిచ్చాసుపత్రిలో" అన్నాడాయన. క్లాసంతా గొల్లుమన్నారు

"అవును! అక్కడ మీరు బాగా ఖాళీగా వుంటే ఎల్లా?" అని వెనకాల బెంచిలో ఎవరో అనేటప్పటికి క్లాసంతా మళ్లీ గొల్లుమన్నారు

యిటువంటివన్నీ ఎందుకు వూహించడము? నేను వూహించనివిషయమంటూ వుండదు...బయట వెన్నెలలో పడుకున్నప్పుడు వున్నట్టుండి యిల్లా పడుకుండగానే హఠాత్తుగా ప్రాణముపోతే, కనిపించే దృశ్యముగురించి. ఎవరు ఎల్లా ఏడుస్తారో వూహించుకుంటా!

ఎందుకని?.. ఏం చెప్పగలను? ఆకాశములో తెల్లని మేఘాలు ఎందుకు వెళ్తాయి.. యిల్లా వూహాలోకములో తిరుగుతూవుండడము నాకో కాలక్షేపము

నా జీవితము ఎల్లా వుండాలో నేను వూహించుకుంటూ వుంటా. చాలరోజులు నేను చదివి వుద్యోగాలు చేయడముగురించి వూహించుకుంటూ వుండేదాన్ని ... గాలి మేడలు కట్టుకుంటూ వుండేదాన్ని. కాని అదృష్టము ఏమిటంటే, నేను వూహించినవి జరుగకపోయినా, విచారమంటూ వుండేది కాదు దేనికివస్తే దానికి అనుగుణముగా మారిపోయేదాన్ని...

నాన్నగారు నాకు పైచదువు చెప్పించదలుచుకోలేదు. పెళ్లిచేయాలి అనుకుంటున్నారని తెలిసినా, నా చదువు పోతోందని విచారించాలా? అందాక నేను కన్న కల

**కంచి వాసుదేవరావు**

లన్నీ కాలదన్నేకాను. ఆతరువాత నాకు రావల్సిన వరుడు ఎల్లా వుండాలో వూహించుకుంటూ వచ్చేదాన్ని అతని ఆకారముగురించి, అతని గుణగణాలుగురించి, హోదాగురించి వూహించేదాన్ని

నేను వూహించిన వరుడు చాల అందగాడు శ్రీరాముడు శ్రీకృష్ణుడు కున్నంత అందము, వారికున్నంత ఔదార్యము, ధైర్యము, సాహసము వుంటుంది. అతను పెద్ద వుద్యోగస్థుడు.. నన్ను ప్రాణముకన్న ఎక్కువగ ప్రేమిస్తాడు...నా కళ్ళలోకి చూస్తూ, 'మాలతీ! నువ్వు నా ఆశాజ్యోతి' అంటాడు. నన్ను చూసి ఆయన గర్విస్తాడు. ఆయన్ని చూసి నేను గర్విస్తాను చూచిన వారంతా మేము ఎంత అదృష్టవంతులమో అనుకుంటూ వుంటారు...యీ విధముగా ప్రతిరోజూ ఎన్నో ఊహాచిత్రాలు చిత్రించుకునేదాన్ని!


* * *

ఈ రోజున నన్ను చూడడానికి ఎవరో బొంబాయినుంచి వస్తున్నారు. అతను ఏదో కంపెనీలో కెమిస్టుగా పనిచేస్తూ అయిదు వందలు సంపాదించుకుంటున్నాడు వారి స్వగ్రామము రాజమండ్రి దగ్గర ఏదో వూరు అక్కడవారికి యిల్లు భూములు వున్నాయట యితను, ముగ్గురు అన్నదమ్ములు, యిద్దరు అప్పచెల్లెళ్ళలో పెద్దవాడుట. యిదీ అతని గురించి విన్న విశేషాలు. రెండుమూడు రోజులనుంచి, నాన్నగారు ఈ విషయమే మాట్లాడుతున్నారు

ప్రొద్దున్ననుంచీ, అందరూ వచ్చేవారి నాహ్వానించే సన్నాహాలలో వున్నారు. వారికోసము అమ్మ రకరకాల పిండివంటలు చేస్తోంది.. నాన్నగారు స్వయంగా, హాలు అలంకరిస్తూ వున్నారు. ఎప్పుడో నాలుగింటికి వస్తారనగా, రెండింటినుంచే, నన్ను ముస్తాబు అవమన్నారు

ఏవిధముగా అలంకరించుకుంటే ఆకర్షణీయముగా వుంటానో, తెగని సమస్యయింది. ఏచీర కట్టాలో, ఏ జాకెట్టు తొడగాలో, చివర జడ అల్లకుండా వుచ్చుగా వదిలివేయాలో, లేకపోతే చివరకి రిబ్బను పెట్టుకోవాలో, తలలో ఏ పూలు ఎల్లా పెట్టుకోవాలో, పాడమనగానే త్యాగరాయకీర్తన పాడాలో హిందీ పాట పాడాలో.. ప్రతివిషయము పెద్ద సమస్యయింది

వాళ్లు నాల్గుంపావుకి వచ్చారు. నాన్నగారు వారిని లోపలికి తీసుకువచ్చారు ఆయన, ఆయనతోపాటు యింకొక యిద్దరు వచ్చారు. వారూ, నాన్నగారు కుర్చీలలో కూర్చున్నారు నన్ను జంబుఖానామీద కూర్చోపెట్టారు. అతని మొగమువంక ఎల్లా చూడగలను? తల వంచుకొనే, చూసీచూడనట్టు అతన్ని పరీక్షించా. మెరుస్తున్న బూట్లు, తెల్లని పాంటు, లేతపచ్చని బుష్‌కోటు, కళ్ళజోడు, నున్నగా పైకి దువ్విన జుట్టు .. యిదీ ఆయన ఆకారము ఛాయ తెలుపు క్రింది లెక్క అతిక్రమించినట్టు అంత పెద్ద ముక్కు లేకపోతే, అతను అందగాడు క్రింది లెక్క ముఖం అంత బాగానే



ఉన్నప్పుడు యీ ముక్కగురించి అట్టె బెంగపెట్టుకోనక్కర్లేదు నన్ను పాటపాడ మన్నారు "నసుపాలింప నడచివచ్చితివా" అనే పాట పాడాను హిందీ పాటలు వినుయినా పాడమని, ఆ వచ్చినవాళ్ళలో ఒకరడిగారు అనార్కలీలో పాట పాడాను

తర్వాత ఏ సంగతీ వ్రాస్తామని వాళ్ళు వెళ్ళిపోయారు. నాన్నగారు వారితో వెళ్లారు.

వాళ్లు వెళ్లిపోయాక అద్దం ముందు నుంచుని నా అందాన్ని నేనే విమర్శచేసుకున్నాను నా మొగము చాల అందమయినదని ఆ క్షణములో అనిపించింది.. నుదురు మీదపడుతున్న వుంగరాల జుత్తు, విల్లువలె వున్న కనుబొమ్మలు, నల్లటికళ్లు. నా అందాన్ని నిరూపిస్తూవున్నాయి తెల్లటి పట్టుచీరమీద గులాబీరంగు జాకెట్టు, మెళ్లో మెరుస్తున్న రవ్వలహారము, గులాబీరంగు జాకెట్టుమీద నల్లటి త్రాచులాగా పడుతున్న జడ, తల్లో మల్లెచెండు, ఆ మల్లెచెండు పైని గులాబీ పువ్వు నా ఆకారాన్ని చూసి ఎవరు మెచ్చుకోకుండా వుండగలరు?

"ఏంచెప్పారు" అని అమ్మ వాళ్లని సాగనంపి వచ్చిన నాన్నగారి నడిగింది.

"తర్వాత వ్రాస్తామన్నారు నాకు మటుకు వారికి నచ్చిందనే తోస్తోంది యింతకీ అమ్మాయి అదృష్టము." అన్నారు నాన్నగారు

"మన అమ్మాయికేం? అదృష్టవంతురాలే" అంది అమ్మ

ఆ మాటలు నాకు నిజమనిపించాయి

ఇంట్లో అందరూ యీ వివాహము తప్పక జరుగుతుందనుకున్నారు నేను నా బొంబాయి జీవితముగురించి వూహించుకుంటున్నా ఇంతవరకు నే నూహించుకున్న వరుడు వూహా పేరు ఆకారము లేదు యిప్పుడు అవన్నీ ఏర్పడ్డాయి ఒకముక్క తప్పిస్తే, నా వూహా సుందరుడికీ యితనికీ తేడా లేదు.

బొంబాయి జీవితము, జూహూ బీచిలో పిక్నిక్కు, సినిమాలు, ఆర్టుఎగ్జిబిషన్లు, సోషలు ఏ్ఫైర్స్, బొంబాయి ఆంధ్రమహిళా సంఘములో (అటువంటిది వుందనే భావిస్తున్నా) నేను వహించబోయే ప్రముఖ పాత్రా ఊహాచిత్రాలుగా వెలువడ్డాయి బొంబాయిలో ఎయిన్న ఆ యింటిలో ఏగది ఎవ్వుండాలో ఎల్లా అలంకరించాలో వూహించుకు వూహించగలిగిన శక్తి వుండాలికాని, దానికి అంతు ఏది! సముద్రములో కెరటము తర్వాత కెరటము వస్తుంది..అల్లాగే వూహ తర్వాతవూహ!

ఆనాటినుంచి ప్రతిరోజూ వుత్తరము కోసము ఎదురుచూసేవాళ్ళము వారములో జాలయినా, పదిరోజాలయినా వుత్తరము లేదు. తర్వాత మధ్యవర్తిద్వారా తెలిసింది... వాళ్ళకి మా సంబంధము నచ్చలేదని...

"అమ్మాయి చాల అదృష్టవంతురాలు అనుకున్నానండి" అంది అమ్మ కొంచెము నవ్వుతూ!

"నా కింత ప్రతి సంబంధము అవుతుం దెందుకని? యింతకంటె మంచిసంబంధమే

(30 వ పేజీ చూడండి)

# ఊహించిన వరుడు

దానికి తాసివుంటేమో" అని నాన్నగారన్నారు

మళ్లీ నా 'సుందరుడు' ఊహామాత్రుడుగానే మిగిలిపోయాడు. ఆ 'సుందరుడి' ముక్కు వంకతీరినందుకు నవ్వుకున్నా... మళ్ళీ ఆ సుందరుడికి వూరుపేరు, ఆకారము ఏర్పడలేదు.

మాకు నచ్చినసంబంధాలు వారికి నచ్చవు; వారికి నచ్చినవి మాకు నచ్చవు. నాన్నగారు, స్నేహితులు, నా వివాహముగురించి ప్రయత్నిస్తూనే వున్నారు

ఇంకొక సంబంధము వచ్చింది.. వారిదేదో పల్లెటూరట. మంచి స్థితిపరులు. ఆ గ్రామానికి మకుటములేని మహారాజులట.

వాళ్లు చూసుకోవడానికి వచ్చారు...ఆ 'వరుడి'లో పల్లెటూరి లక్షణాలు - ముఖ్యముగా మోటతనము—కన్పించాయి

"పల్లెటూరివాడయితే, అమ్మాయి అక్కడ ఎంతో సుఖపడుతుంది. పల్లెటూళ్ళలో, స్థితిమంతుల యింటి యజమానురాలు అవడము కన్న అదృష్టమేముంది!...నాకా సంబంధము యిష్టమే" అన్నారు నాన్నగారు.

నాకు నాన్న చెప్పినమాటలు నిజమనిపించాయి. పల్లెటూళ్ళలోవున్న గౌరవమర్యాదలు పట్నములో ఎక్కడేడిశాయి. నువ్వెంత సంపాదించుకుంటున్నా నీగురించి పట్నములో నీయింటి పక్కయింటివాడికి తెలియదు. పల్లెటూరిలో ప్రతివాడిగురించి ప్రతివాడికి తెలుసు. ప్రతివాడికి వాడికి వుండవలసిన గౌరవము వుండనేవుంటుంది.

పల్లెటూరి జీవితము గురించి వూహాచిత్రాలు చిత్రించుకున్నా.. చెరువులు, బావులు, వాటినిండా కలువలు తామరలు పచ్చని పొలాలు, పంటకాలువలు, తోటలు, పనసపళ్లు, మామిడిపళ్లు, అనాసపళ్లు...గుర్తుకువచ్చేవి... తెల్లారితేస్తే 'అమ్మగారు, అయ్యగారు' అంటూ వస్తూ వుంటారు. తలుచుకుంటే నేనొక రాణిని.

కానీ, యీ సంబంధము కూడా చెడిపోయింది...నాలో "పట్నపు వాసనలు" ఎక్కువగా కనిపించాయిట. పల్లెటూరులో వుండగలనా, అని అడలుకున్నారుట.

నే నూహించిన వరునికి స్థిరమయిన ఆకారము నిదానము ఏర్పడ్డము లేదు.

"ఇక అమ్మాయికి పెళ్ళిజరిగే యోగ్యత లేదా" అని అమ్మ నిస్పృహ చెందేది... నాన్నగారు, యితరులు మేము తిరస్కరించిన సంబంధాలుచూసి వేలుకరచుకునేవారు.

నాకు చెప్పుకోదగ్గ విచారము లేదు ఎందుకు విచారించాలి! మంచి చెడ్డలు పూర్తిగా నాన్నగారిమీద వదిలివేశాను. ఆయన నా కన్యాయము చేయరని తెలుసు.

* * *

చివరికో సంబంధము వచ్చింది యిదీ మంచి సంబంధమే. ఆయన "గెజెటెడ్ ఆఫీసరు" యింకా చాలా వృద్ధిలోకి రాగల సూచనలు వున్నాయి.. యిప్పటికే, ఏ నాలుగువందలో సంపాదించుకుంటున్నాడు

కాని ఆయన అనాకారి.. నల్లటిమనిషి, పిల్లికళ్లు దొప్పచెవులు. వీటన్నిటినీ మించి.. అతనికి ద్వితీయవివాహము. దురదృష్టవశాత్తూ మొదటిభార్య పోయింది. పాపము చిన్నవాడు.. ముప్పయిళ్లు వుంటాయేమో. పిల్లలు లేరు.. చెప్పిన దాకా రెండో పెళ్లివాడంటే ఎవరూ నమ్మరు

మా కిష్టమయితే వారికేం అభ్యంతరము లేదుట. దాన్నిగురించి అమ్మకీ నాన్నకీ అభిప్రాయభేదాలు వచ్చాయి నాన్నగారికి ఆ సంబంధము నచ్చింది "అనాకారి అవుతే ఏం! - బాగా సంపాదించుకుంటున్నాడు; వృద్ధిలోకి వస్తాడు. అమ్మాయి సుఖపడుతుంది," అని నాన్నగారంటారు.

"అతని ప్రక్క మన అమ్మాయి నిలబడితే చూడడానికి చాలా కష్టముగా వుంటుంది. అమ్మాయికేం తగడ"ని అమ్మ అంటుంది

"నువ్వూ నేను వాదులాడుకోవడం దేనికి? అమ్మాయి యుక్తాయుక్తాలు తెలియని పిల్లకాదు. అమ్మాయి నేకనుక్కుందాము... దాని కిష్టము లేకపోతే వదులుకుందా"మని నాన్నగారన్నారు.

నేను యిన్నాళ్లుగా వూహించిన సుందరుడికీ యీయనకీ ఎక్కడా పోలికలేదు. నేనెప్పుడూ నల్లటివాళ్లని, అనాకారులని వూహించలేదు. కానీ యీ సంబంధానికి వప్పుకుంటే నేను సుఖపడగలనని నాన్న చెప్పిన మాటలు నిజము భార్యాభర్తలలో ఎవరు ఎక్కువ అందగాళ్లయితే వారి అధికారము చెల్లుతుందేమో అనుకుంటాను. అయినా ఆయన మంచివాడు, మంచి పదవిలోను వున్నాడు కేవలం అందగాడు కాదన్న ఆ ఒక్క అంశంకోసం ఆయన్ని నిరసించడము సబబు అనిపించలేదు. ఆ క్షణంలో నాకు అనాకారులమీద చెప్పలేనంత సానుభూతి కలిగింది.

అసలు ఆఫీసర్లు సాధారణముగా అనాకారులు; వారి భార్యలు అందగత్తెలు అని అంటూవుంటారు యీ విషయము ఏ కలెక్టరుగారి భార్యనిచూసినా, డి. యం. ఓ గారి భార్యనిచూసినా తెలిసిపోతుంది.

నాన్నగారు నన్నడగ్గానే 'మీ యిష్టమే నా యిష్టమ'ని జవాబు చెప్పాను.

నేను వ్యక్తిత్వము లేనిదాన్ననీ, ఆశయాలు లేనిదానిననీ అనుకుంటారు సంఘర్షణలో నిలువలేని పిరికిదాన్ని అంటారు. కానీ నాకు అపజయము, అసంతృప్తి అనేవి లేవు. అందుకనే నా జీవితము ఎప్పుడూ సుఖముగానే వుంటోంది ★

శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0

హకల్ బెరిఫిన్
వెల 2-0-0
పోస్టుఖర్చు ప్రత్యేకం.
ఆంధ్ర గ్రంథమాల,
మద్రాసు-1.

★ విచిత్రవ్యక్తి ★
మూలం: మార్క్ ట్వేన్
అనువాదం: నండూరి రామమోహనరావు
వెల రూ. 1-8-0
పోస్టు ఖర్చులు ప్రత్యేకం
ఆంధ్ర గ్రంథమాల, ★ మద్రాసు-1.